క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



వడ్డెమానులో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

నందికొట్కూరు రూరల్ : గ్రామాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు, వడ్డెమాను గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాలతో గ్రామీణ ప్రాంతాలలో సీసీరోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ

నందికొట్కూరు: ఆడుదాం..ఆంధ్ర క్రీడలతో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ శోభారాణి అన్నారు. బుధవారం పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి ఆడుదాం..ఆంధ్ర క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖో, ఖో పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను మున్సిపల్ కమిషనర్ పరిచయం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం..ఆంధ్ర క్రీడలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాప్ జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు డోరతి, జెసింత, పద్మలత, విజయకుమారి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత నంద్యాల

మహానంది: బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామంలో సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన నంద్యాల, నారాయణాపురం, తిమ్మాపురం జట్లకు వరుసగా మొదటి బహుమతి రూ.10,000 రెండో బహుమతి రూ. 5,000 మూడవ బహుమతి రూ. 3వేలు అందించారు. బహుమతి దాతలు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నందగిరి పద్మావతమ్మ, శివయ్య, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ తేలపురి నారాయణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డిలను క్రీడాకారులు సన్మానించారు. గ్రామానికి చెందిన కిరణ్, మాబుషా, నాగార్జున క్రీడాకారులకు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి విజేతలకు క్రీడా సామగ్రి పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. మండల స్థాయిలో విజేతలైన క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో ఆడటానికి ప్రొఫెషనల్ క్రీడా సామగ్రినీ అందజేశామన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలు ఆత్మకూరులో ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు.

రథయాత్రను విజయవంతం చేయండి

ఆత్మకూరు: పట్టణంలో గురువారం నిర్వహిస్తున్న బీసీ రథయాత్ర విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, బాలస్వామి యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ గురువారం ఉదయం భారీ బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని, అనంతరం రథయాత్ర సందర్భంగా పట్టణంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, స్వాములు, శివ, ఎల్లయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరికి పుష్పోత్సవ శోభ



పుష్పాలతో అలంకరించిన ధ్వజస్తంభం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయ దేవాలయాల్లో ప్రధాన ద్వారాలు, ధ్వజస్తంభాలు, ఆలయ మండపాలకు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగాణంలో మొక్కలతో శివలింగాల అకృతులు, ఓం అకృతి, వివిధ రకాల జంతువుల అకృతులతో తయారు చేసిన కళాత్మకమైన చెట్లు పలువురు భక్తులను అకట్టుకున్నాయి.

సౌకర్యాలు మెరుగుబడి

- నాడు-నేడుతో మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు
- తొలి విడతలో రూ.12కోట్లతో 23 పాఠశాలల్లో పనులు పూర్తి
- రెండో విడత 34 స్కూళ్లకు రూ.23 కోట్లు మంజూరు



ఆత్మకూరు: రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో సరస్వతీ నిలయాలైన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. గతంలో ఫలితంగా శిథిలావస్థకు చేరిన పాఠశాలలు సైతం నూతన హంగులతో కొత్తశోభను సంతరించుకున్నాయి.

57 పాఠశాలల్లో పనులు

ఆత్మకూరు మండలంలో ప్రాథమిక , ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 57 ఉన్నాయి. ఇందులో తొలివిడత నాడు-నేడు కింద రాష్ట్ర ప్రభుత్వం 23 పాఠశాలలను గుర్తించింది. ఇందుకు దాదాపు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో పనులన్నీ పూర్తి కావడంతో పాఠశాలలు రూపుదిద్దుకుంది. రెండో విడత కింద 34 పాఠశాలల్లో రూ.23 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో కూడా పనులు త్వరితగతిన నిర్మాణాలు జరుగుతున్నాయి.

పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద ప్రభుత్వం



పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నూతన డెస్కులు

పలు సౌకర్యాలను కల్పించింది. గ్రీన్‌బోర్డులు, డెస్కులు, బాత్రూమ్‌లు, మినరల్ వాటర్ ప్లాంట్, టాయిలెట్స్, తరగతి గదుల్లో ఫ్యాన్లు లాంటి వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించారు. ఇలా పాఠశాలలు కొత్త హంగులతో విద్యార్థులు, తల్లితండ్రులను, ఉపాధ్యాయులను సైతం ఆశ్చర్యపరిచే విధంగా రూపురేఖలు మారిపోయాయి. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, వెంకళరెడ్డినగర్, ఇందిరానగర్ పాఠశాలలతో పాటూ సిద్ధపల్లి, ముష్టపల్లి, కరివేన నల్లకాల్వ, కురుకుంద, వెంకటాపురం , అమలాపురం పాఠశాలల్లో నాడు -నేడు కింద దాదాపు 23 పాఠశాలలు కొత్త హంగులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మిగత 34 పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

సులభసరళిలో విద్యాబోధన

ప్రభుత్వ పాఠశాలల్లో సులభతరంగా విద్యార్థులకు



గోడలపై ఆకర్షణీయంగా బొమ్మలు

అర్థమయ్యే రీతిలో పాఠశాలల్లో నూతన విద్యాబోధనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బొమ్మల ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యను అందించడానికి, వారికి చదువుపట్ల ఆసక్తి పెంచేలా వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన చిత్రాలను పాఠశాలల గోడలపై చిత్రీకరించారు. అలాగే పలు పాఠశాలలకు ప్రహరీ గోడలు, ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించారు.

కొత్తహంగులతో పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కింద ప్రభుత్వం ప్రత్యేక స్థాయిలో అత్యున్నతంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందించింది. మండలంలోని 57 పాఠశాలల్లో తొలివిడత 23 పాఠశాలలు, రెండో విడత మరో 34 కొత్త పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి. త్వరలోనే అన్ని పాఠశాలలు కొత్తహంగులు సంతరించుకోనున్నాయి. **– జానకీరాం, ఎంఈఓ, ఆత్మకూరు**



రూపురేఖలు మారిన వెంగళరెడ్డి నగర్ పాఠశాల

పాఠశాలల్లో ఎంతో మార్పు



ప్రభుత్వ పాఠశాలల్లో ఊహించని మార్పులు వచ్చాయి. పాఠశాలలు కొత్త శోభను సంతరించుకుంటాయని ఊహించలేదు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్లాదపరిచే విధంగా కొత్త రూపురేఖలు సంతరించుకోవడం సంతోషంగా ఉంది.

– శేఖర్‌నాయక్, హెచ్ఎం, వెంగళరెడ్డినగర్, ఆత్మకూరు

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

మిడుతూరు: ప్రతిపక్షపార్టీకి చెందిన నాయకులు సీసీ రహదారులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఏర్పాటు చేసుకొని ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాకముందే పాలకపక్షం సభ్యులు ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డిని నిలదీశారు. చింతలపల్లి గ్రామంలో ఈ నెల 15న ఆ గ్రామ సర్పంచ్ రవణమ్మ ఆధ్వర్యంలో రెండేళ్ల క్రితం ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రహదారికి సంబంధించిన శిలాఫలకాన్ని టీడీపీకి చెందిన మాండ్ర శివానందరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారన్నారు. అధికారులకు, మండల ప్రజాప్రతినిధులకు సమాచారమివ్వకుండా ప్రారంభోత్సవాలు చేసుకున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సమంజసం కాదన్నారు. దీనికి నిరసనగా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు.మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, కో-ఆప్షన్ మెంబర్ మౌలా పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ఏకాంతసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారికి బుధవారం రాత్రి ఏకాంత సేవ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో వేద పండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొలువు చేశారు.



వేదశ్రవణం చేస్తున్న వేదపండితులు

శ్రీశైలంలో వేదశ్రవణం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామిఅమ్మవార్లకు ఆయా సేవలన్నీ పరిపూర్ణంగా జరిపించాలనే భావనతో వేదశ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాంగాణంలోని అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో అర్చక స్వాములు, వేదపండితులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతిపూజ జరిపారు. అలాగే ఋత్విగ్వరణ కార్యక్రమంలో వేదపండితులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేదపఠన కార్యక్రమం జరిపించారు. 3గంటల పాటు నిరంతరాయంగా వేదపారాయణలు కొనసాగాయి. దేవస్థాన వేదపండితులతో పాటు కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం, ద్వారక తిరుమల, ఇంద్రకీలాద్రి-విజయవాడ దేవస్థానాల నుంచి వచ్చిన వేద పండితులతో పాటు తిరుపతి, హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

ముగిసిన తాండవ మల్లేశ్వరుడి తిరునాల

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన శ్రీశ్రీశ్రీ పార్వతీసమేత తాండవమల్లేశ్వరస్వామి తిరుణాల బుధవారం పారువేట ఉత్సవంతో ముగిసింది. పుష్యశుద్ధ సప్తమిరోజు ఉదయం స్వామి అమ్మవార్లకు బిందెసేవ, అభిషేకం, కంకుమార్చన వంటి విశేషపూజలు ఆలయ పురోహితులు లక్ష్మీనరసయ్య శర్మ, మల్లికారుజన ఆచారి నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నందీశ్వరుడి పల్లకీలో వేయించిపజేసి గ్రామ పొలిమేర వరకు పారువేట ఉత్సవం నిర్వహించారు. అక్కడ పారువేట గొర్రెతోక కోసి విడిచారు. దానివెంట యువకులు వెంబడించారు. పారువేట కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కల్లూరి చిన్న జమ్మన్న కుమారుడు శివ అనే యువకుడు పారువేట గొర్రెను పట్టుకొని విజేతగా నిలిచాడు. ఆ యువకుడిని గ్రామస్తులు సత్కరించారు.

వైభవంగా వసంతోత్సవం

పగిడ్యాల: మండలంలోని తూర్పు, పడమర ప్రాతకోట గ్రామాల్లో నాగేశ్వరస్వామి, అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి తిరుణాల బుధవారం జరి



పారువేట ఉత్సవానికి వెళ్తున్న స్వామివారు

గిన పారువేట- నీరువేట(వసంతోత్సవం) ఉత్సవాలతో వేడుకలు పరిసమాప్తి అయినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవ మూర్తులను కోనేటీ నీటిలో శుభ్రం చేసి యథాస్థానంలో ఆలయంలో కొలువుతీర్చారు. పారువేట.. నీరువేట దేవతా మూర్తులకు విశేష పూజలు చేశారు. ఉత్సవాల్లో ముచ్చుమర్రి పోలీసులు బందోబస్తు నిర్వహించడంతో వేడుకలు ప్రశాంతంగా ముగియడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 28న స్వామి వారికి పదహారు రోజుల పండుగ నిర్వహిస్తామని కమిటీ సభ్యులు వెల్లడించారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు లింగాపురం జట్టు

మహానంది: ఆడుదాం ఆంధ్ర బండిఆత్మకూరు మండల స్థాయి క్రికెట్ పోటీల్లో లింగాపురం జట్టు విజయం సాధించింది. ఈ మేరకు గ్రామ నాయకులు, గ్రామస్తులు జట్టు సభ్యులను అభినందించారు. నియోజకవర్గ స్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షిస్తూ జట్టు సభ్యులను సన్మానించారు.

నేడు వలంటీర్లతో సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని ఎంఎంగార్డెన్‌లో గురువారం వార్డు వలంటీర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, వైస్ చైర్‌పర్సన్లు హాజరవుతారన్నారు. సమావేశానికి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అలాగే వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు కూడా హాజరుకావాలన్నారు.

కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్ర



నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికైన దుద్యాల వాలీబాల్ జట్టు

కొత్తపల్లి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయిలో నుంచి ఉత్తమ క్రీడాకారులను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయులు మురళీనాయక్, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలో గువ్వలకుంట్ల, దుద్యాల గ్రామాలకు చెందిన జట్లు తలపడగా దుద్యాల జట్టు మండల స్థాయిలో విజేతగా నిలిచింది. ఈ జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీల్లో పాల్గొంటుందని పీఈటీలు తెలిపారు.

విస్తృతంగా మొక్కలునాటే కార్యక్రమం



మొక్క నాటుతున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో పర్యావరణ పరిరక్షణకు, క్షేత్రపరిధిలో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు దేవస్థానం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా బుధవారం క్షేత్రపరిధిలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మామిడి, సింహాచలం, సంపెంగి, సపోటా, పనస, నేరేడు తదితర మొక్కలను గోశాలలో నాటారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి , ఈఓ పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, ఉద్యాన వన విభాగపు విశ్రాంత డైరెక్టర్ జి.ఈశ్వరరెడ్డి, ఉద్యానవన అధికారి ఎస్.లోకేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా వేదశ్రవణం కార్యక్రమానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలు వేదపండితులు కూడా ఈ మొక్కలను నాటారు. అలాగే ఆలయం ప్రాంగణంలో పలు రకాల మొక్కల కుండీలను ఏర్పాటు చేశారు.

శ్రీశైలంలో స్వచ్ఛతీర్థ కార్యక్రమం



స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో బుధవారం స్వచ్ఛతీర్థ కార్యక్రమంలో భాగంగా క్షేత్రపరిధిలో విస్తృత పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా దేవస్థాన అధికారులు దేవస్థాన గోసంరక్షణశాల, యజ్ఞవాటిక, సిబ్బంది వసతి గృహాలు తదితర చోట్ల పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. స్వయంగా చీపుర్లతో పరిసరాలను శుభ్రం చేశారు. ఏఈఓ బి.మల్లికార్జునరెడ్డి, పర్యవేక్షకులు అయ్యన్న పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుసుమలత

కొత్తపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ తాండ మల్లేశ్వర స్వామి తిరునాల సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి వృషభాల పాల బండ (బండలాగుడు) పోటీలు బుధవారం హోరాహోరీగా సాగాయి. పోటీలను ఎంపీపీ కుసుమలత, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి, ఎస్ఐ హుస్సేన్ బాషా ప్రారంభించారు. పోటీల్లో కర్నూలు జిల్లా పంచలింగాల గ్రామానికి చెందిన బైరపోగువారి వృషభాలు మొదటి బహుమతి రూ.50 వేలు (దాత: శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి), కర్నూలు జిల్లా పి. రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్ల గౌడ్ ఎద్దులు రెండో బహుమతి రూ. 30వేలు (జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి), డోన్ మండలం మల్యాలకు చెందిన ఎస్ ఎస్ వి ట్రేడర్స్ వారి వృషభాలు మూడవ బహుమతి రూ.20 వేలు (సీఎం ఆగ్రో ఏజెన్సీ, స్వరాజ్ ట్రాక్టర్ షోరూం ఆత్మకూరు, ఐచర్ షోరూమ్ నందికొట్కూరు), కోడుమూరు మండలం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన కృష్ణప్రసాద్ ఎడ్లు నాలుగవ బహుమతి రూ.10వేలు (సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్ రెడ్డి) సొంతం చేసుకున్నాయి. అదేవిధంగా కర్నూలు జిల్లా పి.రుద్రవరం గ్రామానికి చెందిన గోపాల్ గౌడ్ వృషభాలు ఐదవ బహుమతి రూ. 5వేలు (గజ్జల వెంకటరమణ యాదవ్), తుగ్గలి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన ముని రంగడు, బొంది మాడుగులకు చెందిన షేక్షావలిల వృషభాలు ఆరవ బహుమతి రూ. 3 వేలు (తెలుగు అశోక్) సొంతం చేసుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ నాగ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, సచివాలయ కన్వీనర్లు చింతమాను శ్రీనివాసులు యాదవ్, లింగారెడ్డి, జగనన్న ఇళ్ల స్థలాల మండల కో-ఆర్డినేటర్ పరుశురాముడు, వైఎస్సార్‌సీపీపి నాయకులు లోకేశ్వర రెడ్డి, మొల్ల భాష తదితరులు పాల్గొన్నారు. గుణంపల్లి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు పురుషోత్తం రెడ్డి, వాసుదేవ రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులు



పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉస్మాన్‌బాషా, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు

పగిడ్యాల: సంక్రాంతి తిరునాలను పురస్కరించుకుని పడమర ప్రాతకోట అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వర, నందీశ్వరస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించిన అంతర్రాష్ట్రస్థాయి 4 పళ్ల విభాగం బండలాగుడు పోటీలు బుధవారంతో ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పోటీలలో పాల్గొనేందుకు 19 జతలు పాల్గొన్నాయి. పోటీలను నందికొట్కూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉస్మాన్‌బాషా, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ప్రారంభించారు. హోరాహోరీగా కొనసాగిన బలప్రదర్శనలో జోగుళాంబ గద్వాల జిల్లా బి.తాండ్రపాడు వృషభాలు ప్రథమ విజేతగా నిలిచాయి. అదే జిల్లా నల్లగట్టు వృషభాలు రెండవ స్థానంలో, నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి వృషభాలు మూడవ స్థానంలో, నొస్సం గ్రామానికి చెందిన కొణిదేల హరినాథ్‌రెడ్డి వృషభాలు నాల్గవ విజేతగా నిలిచాయి. రాయచూర్ టౌన్ కోడేన్న వృషభాలు 5వ స్థానంలో కొనసాగి ఆహుతులను అబ్బురపరిచాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సౌజన్యంతో జరిగిన బండలాగుడు పోటీల విజేతలకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్‌లు సంయుక్తంగా మొదటి విజేతకు రూ. 30వేలు అందజేశారు. అలాగే రెండవ విజేతకు నందికొట్కూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉస్మాన్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉస్మాన్ బేగ్ సంయుక్తంగా రూ. 20 వేలు, మూడో విజేతకు ఘణపురం బొబ్బిటి ప్రభాకర్‌రెడ్డి రూ. 15 వేలు, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా మల్లారెడ్డి నాల్గవ విజేతకు రూ. 10 వేలు, పగిడ్యాల సింగిల్‌విండో చైర్మన్ శిరిగిరెడ్డి చంద్రారెడ్డి రూ. 5 వేల నగదును అందజేశారు.

క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలి



కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్లు విజయ్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ సంతృప్తినిచ్చింది

శ్రీశైలం నియోజకవర్గం తొలిసారిగా కేపీఎల్ క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని, భారీ స్థాయిలో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం హర్షణీయమని శిల్పా కార్తీక్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిది రోజులు పాటు జరిగిన క్రికెట్‌పోటీల్లో 205 జట్లు పాల్గొన్నాయని చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో సెమీ ఫైనల్, ఫైనల్‌పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటలకు సెమీఫైనల్ మ్యాచ్ ప్రారంభమవుతుందని తెలిపారు. పోటీల్లో విజేత జట్టుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా రూ.లక్ష బహుమతి, రెండో బహుమతి రూ.50వేలు అందిస్తామని చెప్పారు.

2047 కంతా అగ్రదేశాల సరసన భారత్



స్వయం సహాయక సంఘాలకు మోడల్ చెక్కు అందజేస్తున్న డైరెక్టర్ సంజయ్

ఆత్మకూరురూరల్: 2047వ సంవత్సరానికంతా భారతదేశాన్ని అగ్రదేశాల సరసన నిలపడమే ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకింగ్ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గత నవంబర్ 25న ప్రారంభమై 65 రోజులుగా సాగుతోందన్నారు. ప్రజలను దారిద్ర్యరేఖకు ఎగువకు తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను చిట్టచివరి లబ్ధిదారులకు చేరేలా చేయడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు పలు బ్యాంకుల నుంచి రుణ మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ దాస్, డీపీఓ మంజుల, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబాన, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు రాజమోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సురేష్, ఎంపీడీవో మోహన్ కుమార్, సర్పంచ్ మాణిక్యమ్మ, నాబార్డ్ డీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, ఈఓఆర్డీ సంజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండ్ మోహన్ గ్రామపంచాయతీలో నిధులు ఎలా ఖర్చు చేయాలి..? ఎలా ఆదాయం తీసుకురావాలి, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే విషయాలు వివరించారు.

జూపాడుబంగ్లా: ప్రజల భాగస్వామ్యంతో వారి అభిప్రాయాలను సేకరించుకొని గ్రామపంచాయతీల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు.

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటరమణ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం జరిగింది. శిక్షకులు వరలక్ష్మి, మల్లికార్జున ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికల తయారీపై అధికారులకు అవగాహన కల్పించారు.

పాములపాడు: 2024-25 ఏడాదికి గాను గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికల తయారీపై సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు బుధవారం శిక్షణ ఇచ్చారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ మంజుల వాణి

మహానంది: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి వాటిని ఆమోదించడంతో పాటు ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఎంపీడీఓ శివ నాగజ్యోతి తెలిపారు. ఎం.తిమ్మాపురం గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో బుధవారం ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు గ్రామాభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. అలాగే బండి ఆత్మకూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ వాసుదేవ గుప్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

మహానంది: బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలో శ్రీ లింగమయ్య, పెద్ద బాదుల్లా, చిన్న బాదుల్లా స్వామివార్ల ఉరుసు వేడుకలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు బంధుమిత్రులను పిలుచుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామి వార్లకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com